సాక్షి కామారెడ్డి

ఆదివారం । 1 । జనవరి । 2023



పీడీ యాక్ట్ పెట్టాలి

హిందూ దేవుళ్లను కించపరుస్తూ మాట్లాడిన వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు.

- 9లో ▸



ఆగం చేసిన కల్తీ కల్లు!

నిత్యం కల్తీ కల్లు సేవించే అలవాటు శబరి మలై వెళ్లిన వారిని ఆగం చేసింది. శెట్పల్లి సంగారెడ్డికి చెందిన ఓ వ్యక్తి తప్పిపోయాడు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.0 /14.6

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న నీటి విడుదల



నిజాంసాగర్: యాసంగి పంటల సాగు అవసరాల కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఆయకట్టు కింద ప్రస్తుతం వరినాట్లు వేస్తుండడంతో ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. మొదటి దఫా నీటి విడుదల డిసెంబర్ 14 న ప్రారంభమైన విషయం తెలిసిందే. వాస్తవానికి మొదటి విడతలో పదిహేను రోజుల పాటే ఆయకట్టుకు నీటిని విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ ఆయకట్టు ప్రాంత అవసరాల మేరకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు రోజుకు 1,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి 1,403.22 అడుగుల(15.281 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

'ఎంప్లాయిమెంట్ కార్డు రెన్యువల్ అక్కర్లేదు'

కామారెడ్డి క్రైం: ఎంప్లాయిమెంట్ కార్డును ఇకపై మూడేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాల్సిన అవసరం లేదని జిల్లా ఉపాధి కల్పన అధికారి మధుసూధన్‌రావు తెలిపారు. ఈ విషయమై ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఒకసారి ఎంప్లాయిమెంట్ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఇకపై అభ్యర్థికి 54 ఏళ్ల వయసుగానీ, ప్రభుత్వ ఉద్యోగం గానీ వచ్చేవరకు చెల్లుబాటు అవుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు.

స్కౌట్స్ జంబోరీకి మాచారెడ్డివాసి



గోపాలకృష్ణ

మాచారెడి: భారత్ స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో రాజస్థాన్ లోని పాలీలో 3 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి జంబోరీలో మాచారెడ్డివాసి పాల్గొననున్నారు. సోమారంపేట స్కూల్‌లో పనిచేసే స్కౌట్స్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కమిషనర్ గుగులోత్ గోపాలకృష్ణ ఈ శిబిరానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరానికి వచ్చే మార్చ్‌పాస్ట్, కలర్ పార్టీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి తనను ఎంపిక చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.

తపస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



బాన్సువాడ టౌన్: బాన్సువాడలోని సరస్వతి శిశుమందిర్‌లో శనివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పుల్లం రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భూనేకర్ సంతోష్, ఉపాధ్యక్షులుగా శోభన్‌బాబు, జనార్దన్, విశ్వనాథుల ఆంజనేయులు, బాల్‌రాజ్, రాజశేఖర్, సంగమేశ్వర్‌గౌడ్, ఆర్థిక కార్యదర్శిగా శ్రీరాం లక్ష్మీపతి, కార్యదర్శులుగా సత్యనారాయణ, హీరాలాల్, రాజ భాస్కర్, వేద ప్రకాష్, మంజుల, జిల్లా సేవా ప్రముఖ్‌గా రాజేంద్రప్రసాద్, అకడమిక్ కన్వీనర్‌గా అరుంధతి, కోఆర్డినేటర్‌గా స్వరూపరాణి, సాంకేతిక కార్యదర్శిగా రాకేష్, మహిళా కన్వీనర్‌గా ఉమదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ప్రసాద్, సురేఖ, తిరుపతి, సాయిలు, బాపురావు, అరుణ్‌కుమార్, డివిజన్ కార్యదర్శులుగా ఖయ్యుం, ఆనంద్, రాజ్‌కుమార్, మధుసూదన్, క్రీడా ప్రముఖ్గా సంతోష్, సాంస్కృతిక కార్యదర్శిగా శ్రీనివాసశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో తపస్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ వ్యవస్థా ప్రముఖ్ సత్యనారాయణ ఆవిష్కరించారు.

'ఉస్మానియా గ్లోబల్ అలూమ్నీ'కి ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: ఉస్మానియా విశ్వవిద్యాలయం గ్లోబల్ అలూమ్నీ మీట్-2023కు తాడ్వాయి మండలం దేవాయిపల్లికి చెందిన శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డికి గెస్ట్ ఆఫ్ హానర్‌గా ఆహ్వానం అందింది. ఉస్మానియా వైస్ ఛాన్స్‌లర్ డి.రవీందర్ ఆయనకు ఆహ్వానం పంపారు. 3, 4 తేదీల్లో నిర్వహించే ఉస్మానియా గ్లోబల్ అలూమ్నీలో ఆయన పాల్గొననున్నారు.

నూతన సంవత్సరం నవ సంకల్పం

- లక్ష్యాలు నిర్దేశించుకున్న ప్రముఖులు
- సమగ్రాభివృద్ధే ధ్యేయమంటున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- అదే బాటలో ఎమ్మెల్యేలు
- విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తామంటున్న కలెక్టర్ పాటిల్

సాక్షి, కామారెడ్డి: కాలగర్భంలో మరో ఏడాది కలిసిపోయింది. ఎన్నో మధురానుభూతులు, విషాద ఘటనలకు సాక్షిగా నిలిచిన 2022 సంవత్సరం జ్ఞాపకంగా మిగిలిపోయింది. అదే సమయంలో కోటి ఆశలను మోసుకుంటూ 2023 రానే వచ్చింది. కొత్త ఎప్పటికీ వింత అన్నట్లుగా.. 2022 కు వీడ్కోలు చెప్పిన జిల్లావాసులు.. అంగ్ల నూతన సంవత్సరానికి అంతే ఘనంగా స్వాగతం పలికారు. శనివారం అర్ధరాత్రి జిల్లావ్యాప్తంగా కొత్త సంవత్సర సంబురాలు అంబరాన్నంటాయి. పిల్లలనుంచి పెద్దల వరకు చాలామంది అర్ధరాత్రి 12 గంటలకు మేల్కొని ఉండి, శుభాకాంక్షలు చెప్పుకుంటూ సందడి చేశారు. మరోవైపు గతేడాది ప్రగతిని, వైఫల్యాలను సమీక్షించుకుంటున్న ప్రజలు, నేతలు, అధికారులు.. కొత్త సంవత్సరం లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. 2023 లో చేపట్టబోయే కార్యక్రమాలను ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు హన్మంత్ సింధే, సురేందర్‌తోపాటు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు..



నిజామాబాద్ నగరంలోని ఓ కళాశాలలో సందడి చేస్తున్న విద్యార్థినులు

'కాళేశ్వరం' పరుగులు పెట్టిస్తాం



కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన కాళేశ్వరం ప్రాజెక్టు 22 వ ప్యాకేజీకి సంబంధించి భూసేకరణ చేపట్టాల్సి ఉంది. కొత్త సంవత్సరంలో భూసేకరణ ప్రక్రియ చేపట్టి, పనులు వేగవంతం చేస్తాం. కామారెడ్డి జిల్లాకేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ మొదలైంది. వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం నాటికి కావాల్సిన ఏర్పాట్లన్నీ పూర్తి చేస్తాం. జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ సౌకర్యం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలు ఎంతో కృషి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రిగా.. ఎమ్మెల్యలకు అవసరమైన సహకారం అందిస్తా. రోడ్ల అభివృద్ధికి రూ.150 కోట్లు మంజూరు చేశా. ఆ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించాలన్న లక్ష్యంతో సాగుతున్నాం. సీఎం కేసీఆర్ సహకారంతో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో కలిసి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తా. – వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్అండ్‌బీ శాఖమంత్రి

కామారెడ్డి రూపురేఖలు మారుస్తాం..



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చా. కామారెడ్డిని జిల్లాగా ఏర్పాటు చేయడంతో పట్టణం నలువైపులా విస్తరించింది. అందుకు అనుగుణంగా పట్టణంలో రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది. కొత్త సంవత్సరంలో మరింత ఉత్సాహంతో పనిచేస్తా. డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు పంపిణీ చేస్తాం. కామారెడ్డి నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకు మరింత కృషి చేస్తా. – గంప గోవర్ధన్, ప్రభుత్వ విప్

సొంతింటి కల నెరవేరుస్తాం



కొత్త సంవత్సరంలో పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో సాగుతున్నా. ఇప్పటికే సీఎం కేసీఆర్ సహకారంతో జుక్కల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాం. నియోజకవర్గంలోని భూములకు సాగునీటిని అందించడం కోసం నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి పనులు ప్రారంభించాం. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తా. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. పనులను జూన్‌లోపు పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నా. దళిత బంధు పైలట్ ప్రాజెక్టుగా నిజాంసాగర్‌ను ఎంపిక చేసి దాదాపు అన్ని కుటుంబాలకు లబ్ధి చేకూర్చాం. మిగతా మండలాల్లో దళితులందరికీ విడతలవారీగా యూనిట్లు అందించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడతా. – హన్మంత్ సింధే, ఎమ్మెల్యే

వంద పడకల ఆస్పత్రి నిర్మిస్తాం..



సీఎం కేసీఆర్ సహకారంతో ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నా. ఎల్లారెడ్డిలో రూ.14 కోట్ల వ్యయంతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూస్తా. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందరికీ అందించి సమగ్ర అభివృద్ధి సాధిస్తా. రూ.65 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లు వేస్తున్నాం. వాటిని త్వరితగతిన పూర్తి చేయిస్తా. కాళేశ్వరం ప్రాజెక్టు 22 వ ప్యాకేజీ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటా. – జాజాల సురేందర్, ఎమ్మెల్యే

విద్య, వైద్యానికి ప్రాధాన్యత



ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంతో పాటు విద్య, వైద్య రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం. మన ఊరు–మన బడి పనులు పురోగతిలో ఉన్నాయి. వాటిని పరుగులు పెట్టించి త్వరితగతిన పూర్తి చేయిస్తా. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ద్వారా సత్ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తా. వైద్య సేవలు మరింత మెరుగయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. కంటివెలుగు కార్యక్రమాన్ని సక్సెస్ చేయడానికి చర్యలు తీసుకుంటాం. రక్తహీనతను అధిగమించేందుకు ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్ అందిస్తోంది. వాటిని గర్భిణులు వినియోగించుకునేలా పర్యవేక్షణ పెంచుతాం. – జితేష్ వి పాటిల్, కలెక్టర్

రోడు ప్రమాదాలను నివారించడమే లక్ష్యం



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలతో మరణాలు కొంతమేర తగ్గాయి. ప్రమాదాలను మరింత తగ్గించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటాం. ప్రధాన రహదారులపై ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీలు చేయడం, ట్రాఫిక్ ఉల్లంఘనలకు జరిమానాలు విధించడం ద్వారా వాహనదారులు కొంతమేర మారారు. అతివేగంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులపై మరింత అవగాహన కల్పిస్తాం. ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరిగాయి. వాటిని అరికట్టేందుకు ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. – శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ

163 జీపీ భవనాలకు నిధులు మంజూరు



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కామారెడ్డి క్రైం: ఈజీఎస్ కింద కామారెడ్డి జిల్లాలో 163 గ్రామ పంచాయతీ భవనాలకు నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, అధికారులతో మాట్లాడారు. గ్రామపంచాయతీ భవనాల పనులను త్వరలో ప్రారంభించాలని సూచించారు. ప్రతి పంచాయతీలో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా జరగాలన్నారు. రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలను నిత్యం శుభ్రం చేయాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు చేరేలా చూడాలన్నారు. వైకుంఠ ధామాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. వీసీలో జిల్లా నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఆర్‌డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'మాస్టర్ ప్లాన్' రద్దు చేయాలి

- అప్పటివరకు ఉద్యమం ఆగదు
- రైతు జేఏసీ నాయకులు



సమావేశంలో పాల్గొన్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నేత వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: రైతులకు నష్టం చేస్తున్న కామారెడ్డి మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేసేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. శనివారం టేక్రియాల్‌లోని ఫంక్షన్‌హాల్‌లో బాధిత రైతులు భవిష్యత్ ప్రణాళికపై సమావేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌పై గవర్నర్ తమిళి సై, మంత్రి కేటీఆర్, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరి, చీఫ్ సెక్రెటరి, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు 558 మంది రైతులు హైకోర్టు లాయర్ ద్వారా నోటీసులు పంపించారన్నారు. ఈనెల 5వ తేదీన జిల్లా కేంద్రంలో 4వేల మంది రైతులతో భారీ రైతు ర్యాలీని నిర్వహించాలని నిర్ణయించామన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టేక్రియాల్, దేవునిపల్లి, లింగాపూర్, పాతరాజంపేట, అడ్లూర్, అడ్లూర్ ఎల్లారెడ్డి రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల్లో 'నయా' జోష్

- వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు
- కొత్త ఏడాదిలో కొలువు కోసం వేట
- సన్నద్ధమవుతున్న ఉద్యోగార్థులు

నిజామాబాద్‌అర్బన్: నిరుద్యోగుల్లో 'నయా' జోష్ నెలకొంది. కొత్త ఏడాది ముంగిట కొలువుల జోష్ వచ్చింది. టీఎస్‌పీఎస్సీ వరుసగా నోటిఫికేషన్లు ఇవ్వడంతో ఉద్యోగార్థుల్లో ఆశలు రేకెత్తాయి. గత రెండు మూడు రోజుల్లో గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, స్టాఫ్‌నర్సు తదితర ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చింది. దీంతో ఉద్యోగాల కోసం పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

మొదలైన గ్రూప్ –4 దరఖాస్తు ప్రక్రియ

ప్రభుత్వం ఈ ఏడాది జూన్‌లో గ్రూప్–1 నోటిఫికేషన్ జారీ చేసి ప్రిలిమినరీ పరీక్షలు కూడా నిర్వహించింది. ప్రస్తుతం మెయిన్స్ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు ప్రిలిమ్స్, ఈవెంట్స్ కూడా పూర్తయ్యాయి. మెయిన్స్ నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం తాజాగా గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, స్టాఫ్‌నర్సు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో గ్రేడ్–1, గ్రేడ్–2 వార్డెన్లు, జూనియర్ లెక్చరర్లు, వ్యవసాయ శాఖ, భూగర్భ గనుల శాఖలో పోస్టులకు భర్తీకి సంబంధించి టీఎస్పీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేసింది. శనివారం నుంచి గ్రూప్–4కు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ కూడా మొదలైంది.

శిక్షణ తీసుకునేందుకు ఏర్పాట్లు

పెద్ద ఎత్తున కొలువుల నోటిఫికేషన్లు రావడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. దీంతో ఎలాగైనా కొలువు సాధించాలని ప్రిపరేషన్ కోసం సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నమోదు చేసుకున్న నిరుద్యోగుల సంఖ్య సుమారు 51,879గా ఉంది. క్షేత్రస్థాయిలో మాత్రం అంతకంటే ఇంకా ఎక్కువ సంఖ్యలో ఉంటారు. ప్రస్తుతం వరుస నోటిఫికేషన్లు రావడంతో పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నారు. కొందరు కోచింగ్ సెంటర్లకు వెళ్లేందుకు సన్నద్ధమవుతుండగా, మరికొందరు గ్రంథాలయాలు, ఇంటి వద్దే చదువుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ప్రాంతీయ గ్రంథాలయాల్లో చదువుకునే వారితో పాటు, శిక్షణ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయానికి ప్రతిరోజూ 500 నుంచి 1000 మంది వస్తున్నారు. ప్రాంతీయ గ్రంథాలయాలకు 200 నుంచి 300 మంది వరకు ప్రిపరేషన్ కోసం వస్తున్నారు. అనేక మంది ఆన్‌లైన్‌లో శిక్షణ పొందుతున్నారు. ఈసారి ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలనే ఆరాటంతో ఉన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి చదువుతున్నారు.

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్న వారు..

కేటగిరి	నిజామాబాద్	కామారెడ్డి
ఎస్సీ	3445	6372
ఎస్టీ	1265	2562
బీసీ-ఏ	1365	3745
బీసీ-బి	3782	7864
బీసీ-సి	278	345
బీసీ-డి	4163	6891
బీసీ-ఈ	845	2512
ఓసీ	1863	4582



షెడ్యూల్ ప్రకారం భర్తీ చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వేళ నిరుద్యోగుల్ని బుట్టలో వేసుకునేందుకు నోటిఫికేషన్లు ఇచ్చినట్లుంది. ఈసారి కూడా నిరుద్యోగులను మోసం చేస్తే ఊరుకోనేది లేదు. ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించి షెడ్యూల్ ప్రకారం పోస్టులు భర్తీ చేయాలి. లేదంటే నిరుద్యోగులు తగిన గుణపాఠం చెబుతారు. – లాల్‌సింగ్, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కో–ఆర్డినేటర్

'అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి'



విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి: కొత్త సంవత్సరం అందరి జీవితాలలో వెలుగులు నింపాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆకాంక్షించారు. శనివారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల, గిరిజన బాలికల గురుకుల పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులతో కేక్ కట్ చేయించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నీలకంఠం, సాయిలు, సర్పంచులు అశోక్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, సతీశ్, నాయకులు నునుగొండ శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

- జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: మైనర్లు వాహనాలు నడపవద్దని.. మేజర్లు మాత్రమే నడపాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మానవహక్కుల అవగాహన సదస్సులో మాట్లాడారు. వరకట్న నిషేధ చట్టం, పోక్సో చట్టం, సమానత్వం అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. సీనియర్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. మానవ హక్కులను కోర్టుల ద్వారా సాధించుకోవచ్చన్నారు. సీనియర్ న్యాయవాది గౌరైపాటి మాధవరావు మాట్లాడుతూ.. రాజకీయ, సాంఘిక, ఆర్థిక అంశాల్లో సమన్యాయంపై వివరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, మాణిక్ రాజ్, ప్రిన్సిపాల్ శ్రీరామ్ పాల్గొన్నారు.

గుర్జకుంటకు వచ్చిన బాధితులు

భిక్కనూరు: మండలంలోని గుర్జకుంట గ్రామానికి చెందిన చిట్టీల వ్యాపారి భార్యతో కలిసి పరారు అయిన విషయంపై 'సాక్షి' పత్రికలో శనివారం ప్రచురితమైన కథనంతో బాధితులు గుర్జకుంటకు భారీగా తరలి వచ్చారు. ఆయన వద్ద చిట్టీలు వేసిన వారు శనివారం గ్రామానికి వచ్చి, గ్రామపెద్దలను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. సదరు వ్యాపారి ఇంట్లో దొరికిన బుక్కుల ఆధారంగా ఆయన 43 గ్రూపుల్లో 860 సభ్యులను చేర్చుకున్నట్లు తెలిసింది. అందులో 86 చిట్టీలను సదరు వ్యాపారి తన పేరిట వేశారు. సదరు వ్యాపారికి చెందిన వ్యవసాయభూమి, ఇల్లు అమ్మాలని పలువురు డిమాండ్ చేయగా అందుకు వ్యాపారి తండ్రి సమ్మతించడంతో ఆ భూమిని బాధితులు వెళ్లి చూసి వచ్చారు. ప్రస్తుత లెక్కల ప్రకారం చిట్టీలు వేసిన వారికి రూ.73 లక్షలు, ఇతరుల వద్ద నుంచి మరో రూ.37 లక్షలు రుణంగా తీసుకున్నట్లు ప్రాథమికంగా తేలింది. చిట్టీల వ్యాపారీ బాధితులు సోమవారం గ్రామంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెడ్డపేరు రాకుండా చూసుకోవాలని పలువురు గ్రామస్తులు నిర్ణయించుకున్నారు.



గుర్జకుంటలో సమావేశమైన చిట్టీల వ్యాపారి బాధితులు

భార్యాభర్తల అదృశ్యం

భిక్కనూరు: మండలంలోని గుర్జకుంట గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఇద్దరూ మూడు రోజుల క్రితం అదృశ్యమైనట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన కుంట మహేందర్‌రెడ్డి, బాలమణి దంపతులు ఈ నెల 28 తేదిన వేకువ జామున ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లారని, ఇంతవరకు ఆచూకీ లభించలేదని మహేందర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహేందర్‌రెడ్డి వ్యవసాయం చేస్తుండగా బాలమణి బీడీ కార్మికురాలు. వీరికి సంతానం లేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మెద గ్రామ శివారులో శనివారం రాత్రి ఇద్దరు బాలురు బైక్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. మెదక్ జిల్లా హవేళి ఘన్‌పూర్ మండలం పోచమ్మరాల్ గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు బైక్‌పై నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటకు బయల్దేరారు. మండలంలోని మాల్తుమ్మెద విత్తనక్షేత్ర సమీపంలో ప్రధాన రహదారిపై బైక్‌కు అడ్డుగా వచ్చిన కుక్కను వారు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన ప్రయాణికులు ఇరువురిని చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మెదక్ తరలించారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

భిక్కనూరు: పాతనేరస్తులు తమ పద్ధతులు మార్చుకొని సత్ప్రవర్తనతో మెలగాలని కామారెడ్డి డీఎస్పీ సోమనాథం అన్నారు. శనివారం భిక్కనూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో రాజంపేట, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు మండలాల్లోని పాత నేరస్తులు, రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలిగితే రికార్డుల్లో ఉన్న పాత నేరస్తుల జాబితా నుంచి వారి పేర్లను తొలగిస్తామన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. భిక్కనూరు సీఐ తిరుపయ్య, ఎస్సై ఆనంద్‌గౌడ్, దోమకొండ ఎస్సై సుధాకర్, రాజంపేట ఎస్సై రాజు, బీబీపేట ఎస్సై సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సోమనాథం

లింగంపేట వాసికి డాక్టరేట్

లింగంపేట: లింగంపేటకు చెందిన వెంకటకృష్ణప్రసాద్ శనివారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి జీవరసాయన శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. వెంకటకృష్ణప్రసాద్ 'బయోకెమికల్ అండ్ మాలిక్యులర్ స్టడీస్ ఆన్ రోల్ ఆఫ్ డైట్ ఇన్ ద ఇండక్షన్ ఆఫ్ ఒబేసిటి రేట్ అస్ ఏ మోడల్ సిస్టం' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.



ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పు తీర్చలేక ఆత్మహత్య

భిక్కనూరు: ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీరక పోవడంతో తాగుడుకు బానిసైన ఒక్కరూ ఆత్మహత్య చేసుకున్న ఘటన భిక్కనూరు మండలం భాగిర్తిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వెంకన్నగారి పోచ్యయ్య(62) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య సత్తవ్వ ఒక్క కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పిల్లల పెళ్లిలు చేశారు. అనంతరం పాత ఇంటి స్థానంలో అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నాడు. రోజు కష్టపడ్డప్పటికీ అప్పులు తీరక పోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. భార్య సత్తవ్వ తాగొద్దని చెప్తుండడంతో ఆమెతో తరచు గొడవ పడేవాడు. పోచయ్య శుక్రవారం రాత్రి కూడా తాగి రాగా భార్య అభ్యంతరం చెప్పింది. దీంతో ఆయన గొడవపడి బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే రామాయంపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు సిద్దిపేట ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన చిటికల చిన్నారెడ్డి (53) అనే రైతు అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మహేష్ శనివారం తెలిపారు. వివరాలు.. చిన్నారెడ్డి తనకున్న భూమిలో వ్యవసాయంతోపాటు పాలు విక్రయించి జీవనం సాగిస్తున్నాడు. అప్పులు చేసి గేదెల షెడ్డు ఏర్పాటు చేసుకోవడం, అందులో నష్టాలు రావడంతో అప్పులు పెరిగిపోయాయి. ఆ బాధ భరించలేక గేదెల షెడ్డులో శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు.

బస్సును ఢీకొన్న బైక్

పెద్దకొడప్‌గల్: బస్సును బైక్ ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పెద్దకొడప్‌గల్ జాతీయ రహదారి 161 హైవే బ్రిడ్జి పక్కన శనివారం చోటు చేసుకుంది. మండలంలోని రతన్‌సింగ్ తండాకు చెందిన రాహుల్ శనివారం సాయంత్రం పిట్లం నుంచి పెద్దకొడప్‌గల్ వస్తుండగా బిచ్కుంద నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సును ఢీకొన్నాడు. ప్రమాదంలో రాహుల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

మాచారెడ్డి: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండలంలోని అక్కాపూర్ గ్రామానికి చెందిన రాజయ్య గజ్యానాయక్ తండా చౌరస్తా నుంచి అక్కాపూర్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన రాజయ్యను కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.